క్లుప్తంగా

నేడు నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన



నూతన విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

పెదపూడి: పెదపూడిలోని పెద్ద వీధిలో పునర్నిర్మించిన మహాలక్ష్మి ఆలయంలో శనివారం ఉదయం 10.29 గంటలకు నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సంకల్ప పూజల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం నూతన విగ్రహాలకు క్షీరాభిషేకం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా.. శనివారం విగ్రహాల ప్రతిష్ఠాపన అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

మధురపూడి: 11 కేవీ పోలవరం కెనాల్ ఫీడర్ పనుల నేపథ్యంలో సీతానగరం మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఆ సమయంలో పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, పెద్దకొండేపూడి, అచ్చియ్యపాలెం, చీపురుపెల్లి, నేలకోట గ్రామాలకు విద్యుత్ ఉండదన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అర్చకుడు రాంబాబు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ ఆలయాన్ని పూర్వం పెద్దాపురం మహారాజులు నిర్మించారన్నారు. ఆలయంలో స్వామి పడగ రూపంలో పూజలు అందుకునేవారన్నారు. 2008లో గ్రామానికి చెందిన మల్లిడి కోదండం సోదరులు ఆలయంలో విగ్రహలను స్థాపించారన్నారు.

అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. అలాగే స్థానిక ఊర చెరువు వద్ద గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త క్రొవ్విడి సర్రాజు, అర్చక స్వామి మానేపల్లి సుబ్బారావు, కట్టా వీరసూరి తదితరులు పాల్గొన్నారు.


పేకాట శిబిరంపై దాడి

రాజానగరం: తొర్రేడులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారని ఎస్సై మనోహర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.81 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారందరూ రాజమహేంద్రవరం, సీతానగరం ప్రాంతాలకు చెందిన వారన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచామన్నారు.

నేడు 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

రంగంపేట: మండల పరిధిలోని అన్ని గ్రామాలలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల అభివృద్ధి అధికారి వి.వీర సాయిబాబు, ఈఓపీఆర్డీ పి.వెంకటరత్నం తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. మండలంలోని ప్రతి పంచాయితీ వద్ద జరిగే ఈ కార్యక్రమానికి అధికారులందరూ హాజరుకావాలన్నారు. అనంతరం రంగంపేటలో జరిగే ర్యాలీకి తరలి రావాలని కోరారు.

ఘనంగా సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలోని షిరిడి సాయిబాబా మందిరంలో బాబా విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గురువు మామిడిపల్లి రామారావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కంటే నాగ కేశవరావు ఆధ్వర్యంలో ఉదయం బాబాకు అభిషేకం, సాయంత్రం గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కంటే సత్యచక్ర గణపతి, మూతిన శివమోహన్, పెద్ద తదితరులు పాల్గొన్నారు.

లాభాల వెదురు



- వెదురు సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- అన్ని నేలల్లో పెరిగే అవకాశం
- నేడు జీఎస్ఎల్‌లో శిక్షణ

రాజానగరం: అడవులలో జీవించే వారికి ఉండే జీవనోపాధి మార్గాలలో వెదురు కూడా ఒకటి. మైదాన ప్రాంతాలలో మాదిరిగా అడవులలో వెదురును ప్రత్యేకంగా సాగు చేయాల్సిన అవసరం ఉండదు. దట్టంగా పెరిగే వెదురు బొంగులను కట్ చేసి, విక్రయిస్తూ అటవికులు జీవనోపాధిని పొందుతూ ఉంటారు. అయితే ఈ వెదురు వల్ల ఒక్క ఆటవీకులకే కాకుండా మైదాన ప్రాంతాలలోని నాగరీకులకు కూడా ఎన్నో అవసరాలు ముడిపడి ఉన్నాయి.

పేపర్ తయారీలో..

సాధారణంగా 'వెదురు' పేరు వినగానే ఠక్కున గుర్తుకు వచ్చేది పేపరు. పేపరు తయారీలో వెదురును ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. వెదురుతో కూడిన అడవులు కార్బన్ సింక్‌లుగా పనిచేస్తాయి. ఆక్సిజన్‌ని ఉత్పత్తి చేయడం, నేల కోతను నివారించడం, జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో ఈ వెదురు బహుళ ప్రయోజనకారి అని చెప్పవచ్చు. అంతే కాదు ఇళ్ల నిర్మాణాలు, అల్లికలతో పాటు ఆహార ఉత్పత్తులలో కూడా ఈ వెదురు అవసరం ఎంతో ఉంటుంది.

అన్ని నేలల్లో..

అన్ని రకాల నేలలో సులువుగా పెంచి, మంచి లాభాలను ఆర్జించేందుకు వెదురు సాగు ఉత్తమమని జాతీయ వెదురు మిషన్ (ఎన్‌బీఎం) గుర్తించింది. దీనితో వెదురు సాగును ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో కార్యాచరణ రూపొందించి, తదనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ముఖ్యంగా రాష్ట్రాలలో ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో పొలాల గట్లపై వెదురు సాగును చేపట్టేందుకు ఆసక్తి ఉన్న రైతులకు శిక్షణ ఇచ్చి, ప్రోత్సాహం అందిస్తోంది.

రైతులకు శిక్షణ

> ఉద్యానవన పంటల రైతుల పొలాలలో వెదురు సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయిలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం రాజానగరంలోని జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రి, ఆడిటోరియంలో శనివారం జరగనుంది. జాతీయ వెదురు మిషను ఆదేశానుసారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణకు వివిధ జిల్లాల నుంచి 15 మంది ఉద్యానవన శాఖాధికారులు, వంద మంది అభ్యుదయ రైతులు హాజరవుతారు. సాంకేతిక నిపుణులచే ఉదయం సాంకేతిక శిక్షణ, మధ్యాహ్నం క్షేత్ర పర్యటన ఉంటుంది. క్షేత్ర పర్యటనలో భాగంగా దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టులోని ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీ, అటవీ పరిశోధన కేంద్రాల ప్రాంగణంలో పెంచుతున్న వెదురు సాగు రకాలను పరిశీలించి, నర్సరీలను సందర్శింప జేసి, అవగాహన కలిగిస్తారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.
>
> – బి.సుజాత కుమారి, జిల్లా ఉద్యానవన అధికారి



ఏపుగా పెరిగిన వెదురు మొక్కలు

విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



పట్టపగలు వెంకట్రావును సత్కరిస్తున్న సూర్యారావు, జితేంద్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి అసోసియేషన్ కృషి చేస్తోందని అధ్యక్షుడు కోరాడ సూర్యారావు అన్నారు. వై.జంక్షన్‌లోని ఆనం రోటరీ హాల్లో శుక్రవారం జిల్లా విశ్రాంత రెవెన్యూ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి సంఘ గౌరవాధ్యక్షుడు, విశ్రాంత జిల్లా రెవెన్యూ అధికారి మారిశెట్టి జితేంద్ర అధ్యక్షత వహించారు. సూర్యారావు మాట్లాడుతూ గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి పేరున అసోసియేషన్ ఉండేదన్నారు. దీనిలోని రాజమండ్రి, కొవ్వూరు డివిజన్లను కలిపి కొత్తగా తూర్పుగోదావరి జిల్లా విశ్రాంత రెవెన్యూ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను నెలకొల్పడం జరిగిందన్నారు. సమాజంలో సేవచేసే విశిష్ట వ్యక్తులను ఏటా సంఘం తరపున సన్మానించాలని తీర్మానించామన్నారు. దీనిలో భాగంగా రోటరీ కైలాస భూమి నిర్వాహకుడు, మహాకాళేశ్వరాలయం దేవాలయ నిర్మాత పట్టపగలు వెంకట్రావును సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు సాయితా తారావు, కార్యదర్శి తేజో భాస్కరరావు, కోశాధికారి ఏఎల్ నారాయణరావు పాల్గొన్నారు.

సురేష్ శర్మకు స్వర్ణ కంకణ సత్కారం



అనపర్తిలో సురేష్ శర్మ చేతికి సువర్ణ కంకణం వేస్తున్న దాతలు, భక్తులు

పెదపూడి: అనపర్తికి చెందిన సనాతన ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, వేద పండితుడు రెడ్డి సురేష్ శర్మను స్వర్ణ కంకణంతో ఘనంగా సత్కరించారు. గ్రామంలో ఐదు రోజులుగా సహస్ర పూర్ణచంద్ర దర్శన మహోత్సవం అర్తమూరుకు చెందిన కర్రి వీర వెంకట సత్యనారాయణరెడ్డి, వీర కాత్యాయని దంపతుల ఆధ్వర్యంలో జరుగుతోంది. ఈ కార్యక్రమాన్ని సురేష్ శర్మ భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా యజ్ఞ కర్తల ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన హంపిస్ విల్డర్స్, విష్కర్స్, పెదర్స్ రిసార్ట్స్ అధినేత దాట్ల వెంకటపతిరాజు, నీలవేణి దంపతులు, ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీ దిగ్గజం డైరెక్టర్ జీవీకే ప్రెసిడెంట్ కలిదిండి కృష్ణంరాజు, విజయలక్ష్మి దంపతులు, వసుధ ఫార్మా కెమ్ లిమిటెడ్ అధినేత వీఆర్ఆర్‌వీ, ఫ్యామిలీ వసుధ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంతెన వెంకటరామరాజు వరలక్ష్మి దంపతులు.. సురేష్ శర్మ చేతికి సువర్ణ కంకణం ధరింపచేసి, శాలువా కప్పిపూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ నల్లమిల్లి వీర్రెడ్డి, చిర్ల రామన్న కాపు, కర్రి వికాస్ రెడ్డి, గాయత్రి, డాక్టర్ ఉష, సుజాత పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



లక్ష్మీ కుబేర హోమం నిర్వహిస్తున్న పండితుడు

రాజానగరం: చక్రద్వారబంధంలో ఇటీవల నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష్మీదేవి జయంతిని పురస్కరించుకుని సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురోహితుడు కె.సతీష్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో లక్ష్మీ కుబేర హోమం వైభవంగా జరిపారు.

సత్తెమ్మ తల్లికి మాజీ ఎమ్మెల్యే దంపతుల పూజలు



జి.మామిడాడలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులతో వైఎస్సార్ సీపీ శ్రేణులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని రామలక్ష్మణ్ లేఅవుట్‌లో గల సత్తెమ్మ తల్లి సంబరం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతలను పూజించడం వల్ల ఆయా గ్రామాలు సస్యశ్యామలమవుతాయన్నారు. కాగా.. మాజీ ఎమ్మెల్యే దంపతులకు భారీ ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం పార్టీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే కొంత సేపు పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ద్వారంపూడి ప్రభాకర్ రెడ్డి, ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, ద్వారంపూడి వెంకట్ రెడ్డి, సబ్బెళ్ల చిన్న, సబ్బెళ్ల సుధాకర్‌రెడ్డి, మండ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరికరేవులలో..

బిక్కవోలు: ఆరికరేవుల గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జలాదివాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ,ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. దాతలు తోండాపు సూర్యనారాయణరెడ్డి(సూర్రెడ్డి), శ్రీలత దంపతుల పాటు మాజీ ఎమ్మెల్యే దంపతులు పూజలు చేశారు. కార్యక్రమంలోని ఎంపీటీసీ కొర్ర చక్రధరరావు, బొడ్డు సూరిబాబు, బొడ్డు భాస్కరరావు, తొండాపు గాంధీ, పోతుల ప్రసాద్‌రెడ్డి, బొడ్డు ముత్యాలరావు పాల్గొన్నారు.



ఆరికరేవులలో విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

ఉత్సాహంగా హోలీ సంబరాలు



సంపరలో హోలీ సంబరాలు జరుపుకొంటున్న చిన్నారులు



పందలపాకలో..



పెదపూడి: మండలంలోని పలు గ్రామాల్లో హోలీ పండగను శుక్రవారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. చిన్నారులు, యువత, పెద్దలు ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. హోలీ పండగ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త సంతోషాలు నింపాలని కోరుకున్నారు. సంపర, జి.మామిడాడ, పెద్దాడ, పెదపూడి, రామేశ్వరం, కాండ్రేగుల తదితర గ్రామాల్లో యువకులు, చిన్నారులు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు.

బిక్కవోలు: వసంత పౌర్ణమి పురస్కరించుకొని మండలంలో హోలీ సంబరాలు ఘనంగా జరుపుకొన్నారు. పందలపాక, కొమరిపాలెం, కొంకుదురు, ఊల్లపల్లి, బలభద్రపురం, బిక్కవోలు గ్రామాలలో వేడుకలు జరిగాయి.

ఇసుకాసురుల సవాల్

- కూటమి నేతల అండదండలతో బరితెగింపు
- గోదావరిలో రేయింబవళ్లు డ్రెడ్జింగ్
- దర్జాగా ఇసుక తరలింపు



కోటిలింగాల ర్యాంపులో ఇసుక సీజ్ చేసిన మైన్స్ అధికారులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): 'దమ్ముంటే పట్టుకో షెకావత్.. పట్టుకుంటే వదిలేస్తా సిండికేట్' అంటూ పుష్ప సినిమాలో బాగా పాపులర్ అయిన డైలాగ్ ఇసుక అక్రమార్కులకు నూటికి నూరుపాళ్లు సరిపోతోంది. గోదావరి నదీ గర్భాన్ని అక్రమంగా తవ్వేస్తూ.. సామాన్యులకు ఇసుక అందకుండా చేస్తూ.. అడ్డగోలుగా రూ.లక్షలు సంపాదిస్తున్నారు. గత నెల 23న జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్, కొవ్వూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంయుక్తంగా దాడులు చేశారు. వే బిల్లులు లేకుండా, సామర్థ్యానికి మించిన లోడ్‌తో ఇసుక రవాణా చేస్తున్న 8 వాహనాలను సీజ్ చేసి, రూ.5.72 లక్షల జరిమానా విధించారు. ఇసుకాసురులు ఆ మొత్తాన్ని చెల్లించేసి, తిరిగి యథాతథంగా ఇసుక అక్రమ రవాణాకు తెర లేపుతూ అధికారులకు సవాల్ విసురుతున్నారు. తాజాగా కోటిలింగాల ర్యాంపుల్లో అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. కోటిలింగాల ర్యాంపు చేరువగా మొత్తం ఐదు గుట్టల్లో మొత్తం 1,115 మెట్రిక్ టన్నుల ఇసుకను గుర్తించి, సీజ్ చేశారు. అయితే, ఇలా అధికారులు అప్పుడప్పుడు చర్యలు తీసుకుంటున్నా.. ఇసుకాసురుల దందాకు అడ్డుకట్ట పడటం లేదు. కోర్టు కేసు కారణంగా నగరంలోని కోటిలింగాల ర్యాంపు-1లో ఇసుక తవ్వకాలకు గతంలోనే బ్రేక్ పడింది. అయితే, ఈ ర్యాంపులో 13 వరకూ ఉన్న రీచ్‌లలో ప్రతి రోజూ వందల లారీల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా గోదావరిలో రేయింబవళ్లు డ్రెడ్జింగ్ చేస్తున్నారు. ఒకవేళ అధికారులు పెద్ద మొత్తంలో పట్టుకుంటే కూటమి నాయకులు ఫోన్లు చేసి, ఒత్తిళ్లు తెస్తున్నారు. దీంతో, పట్టుకున్న లారీలను వదిలేసి, అధికారులు నిస్సహాయంగా వెనుదిరగాల్సి వస్తోంది. కోటిలింగాల ర్యాంపుల్లో అధికారులు గతంలో అనేకసార్లు బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీలను, ఇసుక డంప్‌ను పట్టుకున్నారు. కానీ, కూటమి నాయకుల ఒత్తిళ్లతో వాటిని వదిలేశారు. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలను సైతం ఇసుక అక్రమార్కులు పట్టించుకోవడం లేదంటే దందా ఏ స్థాయిలో కొనసాగుతోందో అర్థం చేసుకోవచ్చు.

మహిళా చైతన్యంతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

కంబాలచెరువు: మహిళా చైతన్యంతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. యూటీఎఫ్, ఐద్వా, శ్రామిక మహిళా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం యూటీఎఫ్ సహాధ్యక్షురాలు ఎం.విజయ గౌరి అధ్యక్షతన సదస్సు జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలకు అన్ని రంగాల్లో సమానం ప్రాతినిథ్యం కల్పించినప్పుడే దేశం నిజమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణ్ కుమారి మాట్లాడుతూ మహిళలకు సమాజం, కుటుంబం సహకారాలు అందించాలన్నారు. పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఈ.శ్రీమణి, ఎస్.భవాని, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జరీనా, టి.తులసి, సీనియర్ నాయకులు టి.సావిత్రి, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి బేబీరాణి, ఆశా సంఘం నాయకురాలు నాగమణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అలరించిన రుక్మిణీ కల్యాణం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ భాగవతారిణి పురాణం విజయలక్ష్మి గానం చేసిన రుక్మిణీ కల్యాణం హరికథ శ్రోతలను అలరించింది. త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి ఆడిటోరియంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. వీరా శివప్రసాద్ వయొలిన్, కోటిపల్లి సూరిబాబు మృదంగం సహకారాలను అందించారు. సమితి గౌరవ అధ్యక్షుడు వాడ్రేవు వెంకటరమణ, చైర్మన్ చింతలూరి సుందర వెంకట రావు, ప్రధాన కార్యదర్శి జె.సరస్వతి, ఫంక్షనల్ కార్యదర్శి వక్కలంక రామచంద్రం, కార్యనిర్వాహక కార్యదర్శి వి.భాస్కర్ రామ్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులను నిర్వాహకులు సత్కరించారు. పెద్ద సంఖ్యలో సంగీతాభిమానులు పాల్గొన్నారు.

నేడు శేష గోపాలన్ గాత్రం

కార్యక్రమాల్లో భాగంగా శనివారం చెన్నైకు చెందిన మధురైకృష్ణ శేష గోపాలన్ గాత్ర కచేరీ జరుగుతుంది.

డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్



డ్రోన్ టెక్నాలజీ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రముఖులు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల వాణిజ్య విభాగం, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్నొవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలో డ్రోన్ టెక్నాలజీపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. మూడు రోజులు జరిగే ఈ వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టర్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్ బాబు సహకారం, మార్గదర్శకత్వం ద్వారా ఈ వర్క్‌షాప్ కార్యరూపం దాల్చిందన్నారు. డ్రోన్ టెక్నాలజీ విస్తృత అవకాశాలను పరిశీలించేందుకు అకడమియా, పరిశ్రమను ఒకచోట చేర్చడంలో ఆయన పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. ఏయూ ఐసీడీటీ అధ్యక్షుడు డాక్టర్ ఓఆర్ఎం రావు మాట్లాడుతూ ఐసీడీటీ అభివృద్ధి, చేపడుతున్న కార్యకలాపాలను వివరించారు. విపత్తు నిర్వహణతో సహా అనేక రంగాల్లో డ్రోన్ సాంకేతికత వినియోగం ఆవశ్యకతను తెలిపారు. వర్క్‌షాప్‌లో బీబీఏ ఈవెంట్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొని డ్రోన్ల వినియోగంపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఆర్ట్స్ కళాశాల, ఐసీటీడీ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. దీనిపై ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే, ఏయూ ఐసీటీడీ అధ్యక్షుడు డాక్టర్ ఓఆర్ రావు సంతకాలు చేశారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సి.కోమల, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి.ప్రతిమ, డాక్టర్ పి.సునంద, డాక్టర్ పీవీపీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ తీరుపై కార్మిక సంఘాల నిరసన



శ్యామలా సెంటర్‌లో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రకాశం నగర్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం స్థానిక శ్యామలా సెంటర్ వద్ద కేంద్ర కార్మిక సంఘాలు సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐసీసీటీయూ, యువజన, విద్యార్థి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, ఏఐసీసీటీయూ నాయకుడు నల్లా రామారావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేశామని కేంద్ర ప్రభుత్వం పైకి ప్రకటనలు చేస్తూ, దొడ్డి దారిన ప్రైవేటీకరణ పనులను వేగవంతం చేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రకటించిన ప్యాకేజీని కార్మికుల జీతాలు చెల్లించడానికి ఉపయోగించాలన్నారు. ప్లాంట్‌లో పనిచేస్తున్న 1500 కాంట్రాక్టు కార్మికులను ఇటీవల నిలుపుదల చేశారని, వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించేలా కృషి చేయాలన్నారు. ఆందోళనలో జిల్లా ఉపాధ్యక్షులు బి.పవన్, సీపీఎం కార్యవర్గ సభ్యులు జువ్వాల రాంబాబు, నగర కార్యదర్శి కర్రి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.